క్లుప్తంగా

దర్గాకు సామగ్రి

ఎంపీ రంజిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కమిటీ



ఎంపీ అందజేసిన ఫ్యాన్లతో దర్గా కమిటీ సభ్యులు

షహాడీషరీఫ్: బాబా షర్ఫొద్దీన్ దర్గా 757వ ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి సొంతంగా మెట్లపైకి మ్యాట్, పది ఫ్యాన్లను అందించారు. షహాడీషరీఫ్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు పండెం కొండల్ యాదవ్ దర్గా కమిటీ ప్రతినిధులతో కలిసి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సామగ్రిని బుధవారం రాత్రి వారికి అందజేశారు. దర్గా అభివృద్ధికి కృషి చేయడంతో సొంతంగా కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మీర్‌పేట: బాలాపూర్ మండల మధ్యాహ్న భోజన కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ జే.పెంటయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కృష్ణవేణి, ఉపాధ్యక్షులు గాయత్రి, ప్రధాన కార్యదర్శిగా ఫాతీమాబేగం, సహ కార్యదర్శి అంజమ్మ, కోశాధికారిగా వీరస్వామి, కమిటీ సభ్యులుగా మైసమ్మ, ఖతీజలత, విజయలక్ష్మి, సరిత, శ్రీలత, వనజ, సుమలత, సుధావేణి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కమిటీ జిల్లా కార్యదర్శి స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



గడికోట హైస్కూల్‌లో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మహమూద్ అలీ

మహేశ్వరం: ఈ నెల 13న జరగనున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న పోలింగ్ స్టేషన్‌తో పాటు ఎన్నికల ఏర్పాట్లను గురువారం తహసీల్దార్ మహమూద్ అలీ పరిశీలించారు. మహేశ్వరం మండలానికి గడికోట మైదానంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 69వ నెంబర్ గల పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఓటర్లు సజావుగా ఓటు వేసేందుకు అనుకూలమైన ఏర్పాట్లను చేశామని తహసీల్దార్ మహమూద్ అలీ పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అంతకు ముందు పోలింగ్‌స్టేషన్‌లో ఎన్నికల రోజు చేయాల్సిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు స్వర్ణకుమారి, పావని పలువురు పాల్గొన్నారు.

సంస్కృతిని సంరక్షించుకోవాలి

ఎల్‌బీనగర్: కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజంపై సినిమా ప్రభావం చాలా ఉందన్నారు. భాష, సాంస్కృతి, సంప్రదాయాలు దిగజారిపోతున్నాయని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత సెన్సార్ బోర్డు సభ్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు ఉపేందర్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న రక్తదాన శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 12న తలకొండపల్లి మండలం దేవునిపడకల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతీయువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు.

గెలుపే లక్ష్యంగా పీఆర్టీయూ నేతల ప్రచారం

యాచారం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్న పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డి గెలుపు ఖాయమని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అండెం ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. మొదటి ప్రాధాన్యత ఓటును చెన్నకేశవరెడ్డికి వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్‌యాదవ్, భోజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి లియోకేర్ కృషి

మహిళా దినోత్సవ వేడుకల్లో డీసీపీ సాయిశ్రీ, సినీనటి మధుమిత



మీర్‌పేట: సమావేశం మాట్లాడుతున్న డీసీపీ సాయిశ్రీ, సినీనటి మధుమిత, తదితరులు

మీర్‌పేట: మహిళల ఆర్థికాభివృద్ధికి లియోకేర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మీర్‌పేటలోని మహిళాశక్తి భవన్‌లో లియో కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకలకు సినీనటి మధుమితతో కలిసి డీసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లియో కేర్ ఫౌండేషన్ వారు ఎంతో మంది మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్‌తో పాటు ఇతర స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని డీసీపీ కొనియాడారు. సినీనటి మధుమిత మాట్లాడుతూ.. ఆడ శిశువులను పురిటిలోనే చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్ల పుడితే కేవలం ఒక్క మహిళకే కాదు పురుషుడికి కూడా పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. అనంతరం వారు కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వెయ్యి రూపాయలకే సంవత్సరం మొత్తం అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అను రాగ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు కళ్యాణి ప్రకటించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, ఫౌండేషన్ చైర్మన్ లత, వైస్ చైర్మన్ జ్యోతి, భారతి, ఇతర మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

బడంగ్‌పేట్: ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరుపుకొన్నారు. పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బడంగ్‌పేట కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మహిళలు కలిసి సంబురాలు చేసుకున్నారు. శాలువాలతో సన్మానం చేసి బొకేలు ఇచ్చుకుని కేక్ కట్ చేసి ఆనందంగా వేడుకలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్న, లిక్కి మమత, జెనిగె భారతమ్మ, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, పవన్‌కుమార్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పార్టీ మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగూడలో..

గుర్రంగూడలోని గడ్డం ఎన్‌క్లేవ్‌లో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ దడిగ శంకర్ దంపతులు పాల్గొని కాలనీవాసులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు తదితరులు ఉన్నారు.

మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయంలో

మహేశ్వరం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయంలోని మహిళా అధికారులను తహసీల్దార్ మహమూద్ అలీ గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని వారి సేవలను కొనియాడారు. మహిళలు ఏ రంగంలోనైన సత్తా చాటగలరని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవత ,ఆర్ఐలు స్వర్ణకుమారి, పావని, జూనియర్ అసిస్టెంట్ కల్పన పలువురు పాల్గొన్నారు.

మహిళా సిబ్బందికి ఆటల పోటీలు

మీర్‌పేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుని గురువారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని మహిళా సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ మాట్లాడుతూ.. మహిళా వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, రింగ్‌బాల్ పోటీల్లో మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ అంజన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, వార్డు ఆఫీసర్లు మహేష్, నర్సింహ్మా, లక్ష్మయ్య, శానిటరీ సూపర్‌వైజర్లు రంజిత్‌కుమార్, జీవన్ పాల్గొన్నారు.



బడంగ్‌పేటలో వేడుకలు చేసుకుంటున్న బీఆర్ఎస్ మహిళలు నేతలు



గుర్రంగూడలో నిర్వహించిన సంబరాల్లో కార్పొరేటర్ శంకర్, తదితరులు



మీర్‌పేట: కబడ్డీ ఆడుతున్న మహిళా సిబ్బంది



మహేశ్వరం: మహిళా అధికారులను సన్మానిస్తున్న తహసీల్దార్ మహమూద్ అలీ

మహిళలకు రక్షణ కరువైంది

వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు అంజయ్య

యాచారం: స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ల గడుస్తున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కార్యదర్శి మస్కు అరుణ అన్నారు. మండల పరిధిలోని తమ్మలోనిగూడలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై దాడులు, హత్యలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. పెరిగిన నిత్యవసర ధరలతో కుటుంబాలను పోషించలేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం మహిళలకు సంఘం సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, జంగారెడ్డి, రమాదేవి, బీరయ్య, నవీన, పూజ, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహిద్దాం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి విద్యాసంస్థల ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సిటీ సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్, రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి హాజరై వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. పురుషులతో పోలిస్తే మహిళల్లో మేధాశక్తి ఎక్కువగా ఉంటుందని, మహిళలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో మరింతగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదనకు ప్రజల మద్దతు

- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని బలపర్చాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్ఎస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి అనాజ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న యాత్రకు మంచి స్పందన వస్తోందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సంతోషంగా ఉండాలంటే కేసీఆర్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. పాదయాత్ర ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం వచ్చిందని తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, సర్పంచ్ కావలి రంగయ్య ముదిరాజ్, ఎంపీటీసీ రాచపాక లావణ్యయాదగిరి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్ పాల్గొన్నారు.



అనాజ్‌పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

‘కంటి వెలుగు’తో పేదలకు ప్రయోజనం

ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్, వైద్యులు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమంలో పౌరులందరికి కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన ప్రతి ఒక్కరికి కంటి అద్దాలు పంపిణీ చేస్తారన్నారు. వైద్యుల పరీక్షల అనంతరం అవసరమైన వారికి సర్జరీలు, చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. హానికరమైన కంటి వ్యాధులకు మందులు ఇవ్వడంతో పాటు, కంటి వ్యాధుల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా నాయక్, మన్సాన్‌పల్లి సర్పంచ్ కంది అరుణ, ఉప సర్పంచ్ బి.నర్సింహ యాదవ్, పంచాయతీ కార్యదర్శి జావిద్, బీఆర్ఎస్ నాయకులు కంది రమేష్, అంధ్యానాయక్, రాజు నాయక్, పాండు యాదవ్, వైద్యాధికారి అజయ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మహేశ్వరం: మన్సాన్‌పల్లిలో ‘కంటి వెలుగు’ను ప్రారంభిస్తున్న ఎంపీపీ రఘుమారెడ్డి



బడంగ్‌పేట్: కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సంతోషి, తదితరులు

‘కంటి వెలుగు’తో ప్రయోజనం

బడంగ్‌పేట్: కంటి వెలుగు పథకాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట 23వ డివిజన్ కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషి కోరారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ సంతోషి ప్రారంభించారు. దూర, దగ్గర దృష్టి లోపించిన వారు కంటి పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలు పొందాలన్నారు. మారుతినగర్, ఓల్డ్‌విలేజ్, శివసాయినగర్ కాలనీలతో పాటు అన్ని కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నిష్ణాతులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, కంటి చుక్కల మందులు అందజేస్తారని తెలిపారు. శుక్రవారం కూడా కంటి వెలుగు కార్యక్రమం అందుబాటులో ఉంటుందని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రె కృష్ణ, కాలనీ ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌గౌడ్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతుబంధు ఇవ్వాలి

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి



ఏఓ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

తలకొండపల్లి: అర్హులందరికీ రైతుబంధు మంజూర్ చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి రాజుకు గురువారం ఆయన రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వ పరంగా మంజూర్ చేసిన రైతుబంధు పథకం ద్వారా కొంత మంది రైతులకు మాత్రమే రైతుబంధు డబ్బులు జమ అయ్యాయని, మరి కొందరికి జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 10 నుంచి 15 ఎకరాల లోపు ఉన్న 300 మంది రైతులకు రైతుబంధు జమ కాలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సుమారుగా రూ. 3 కోట్లు రైతుబంధు డబ్బులు మంజూర్ కావాల్సి ఉందన్నారు. రైతుబంధు డబ్బులు మంజూర్ కాకపోవడంతో రైతులు పంటల సాగు కోసం మిత్తి వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రైతుబంధు మంజూర్ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏఓ రాజును వివరణ కోరగా, ట్రెజరీలో డబ్బులు జమ అయ్యాయని, త్వరలో విడుదల అవుతాయన్నారు. అనంతరం రైతుబంధు అందరికి అందనుందన్నారు. కార్యక్రమంలో జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలోని 12వ వార్డుకు చెందిన చుక్క రాములు, 6వ వార్డుకు చెందిన నూతనగంటి లక్ష్మమ్మ మృతిచెందారు. మృతుల కుటుంబాలను గురువారం బీజేపీ నేత ఆచారి, కౌన్సిలర్లు సుండూరి ఝాన్సీ, దివ్య, నాయకులు శేఖర్, శ్రీకాంత్‌సింగ్, మహేశ్, రవి, యాదయ్య, పరమేశ్, ఆనంద్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయ కుటుంబాలకు రూ.5వేలు చొప్పున ఆచారి సేవాదళం సభ్యులు ఆర్థికసాయం అందించారు. అలాగే నూతనగంటి లక్ష్మమ్మ కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు పరామర్శించి చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగిళ్ల జగన్, గణేశ్, ఆంజనేయులు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగంపల్లిలో ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్



విద్యార్థులతో మాట్లాడుతున్న రామ్, లక్ష్మణ్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ప్రముఖ సినీ ఫైటర్స్ రామ్, లక్ష్మణ్ సందర్శించారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. గత మూడు రోజులుగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బందిని సర్పంచ్ ప్రేమలత, ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్ సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యాయులు ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, ఉపసర్పంచ్ గుంపెని పోచాలు, వార్డు సభ్యులు అనసూయ, యాదయ్య, సంతోష, సత్యం, రాజు, అంజమ్మ, కృష్ణయ్య, ఆమనగంటి నర్సింహా, పాఠశాల చైర్మన్ తిరుపతయ్య, అంగన్‌వాడీ టీచర్ సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా పన్నుల వసూలు

- మార్చి 31తో ముగియనున్న గడువు
- మున్సిపాలిటీలో బకాయిలు రూ.3.34 కోట్లు

ఇబ్రహీంపట్నం: ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నప్పటికీ పన్నుల వసూళ్లలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వెనుకబడింది. గృహ, వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య భవనాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు పన్నుల రూపకంగా రూ.9.87 కోట్లు వసూలు చేయాల్సివుంది. అందులో కేంద్ర సంస్థలు, కార్యాలయాల పన్నులు సుమారు రూ.1.37 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల పన్నులు సుమారు రూ.48 లక్షలు రావాల్సిఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన పన్నులు పక్కన పెడితే రూ.8.02 కోట్లు ఇతర మార్గాల ద్వారా పన్నులు రావల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 ముగిసేందుకు కేవలం 20 రోజులు మాత్రమే మిగిలింది. ఇప్పటివరకు రూ.4.68 కోట్లు మాత్రమే పన్నుల రూపకంగా ఆదాయం మున్సిపాలిటీకి వచ్చింది. మరో రూ.3.34 కోట్లు ఇంకా వసూలు కావాల్సివుంది. మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరులు పన్నుల రూపకంగా వస్తుంది. ఇంటింటికి, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు, విద్యాసంస్థల వెంట మున్సిపల్ బిల్ కలెక్టర్లు పన్నుల వసూళ్లకు తిరుగుతున్నారు. మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు ఆయా విద్యాసంస్థల ఎదుట చావు డప్పు కొట్టించగా, మరికొన్ని షాపులను సీజ్ చేశారు. అయినప్పటికీ పన్నులు సకాలంలో చెల్లించడంలో పలువురు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండం శోచనీయం.



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

చర్యలు తీసుకుంటాం



సకాలంలో పన్నులు చెల్లించని షాపులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు తదితర వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆయా సంస్థల ముందు చావు డప్పు కొట్టిస్తాం. ప్రజలు చెల్లించే పన్నులతోనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుంది. పన్నులు చెల్లించి సహకరించాలి.

– ఎండీ.యూసుఫ్, కమిషనర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

ప్రధాని తీరు దేశానికి నష్టం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రధాని నరేంద్రమోడీ వ్యవహారతీరు దేశానికి నష్టం కల్గించేవిగా ఉన్నాయని... ఆయన దేశానికి ప్రధానిగాకాకుండా గుజరాత్‌కు మాత్రమే ప్రధానిగా తన పాలనను కొనసాగిస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. అహ్మదాబాద్‌లో ఆదానీ కట్టిన స్టేడియంలో గురువారం భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య జరుగుతున్న 4వ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనియా అల్బనీస్ హాజరైన నేపథ్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి గురువారం వనస్థలిపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మనసులో మాట అంటూ వివిధ అంశాలపై రూపొందించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సింగరేణి గనుల్లో కావాల్సినంత బొగ్గు లభిస్తున్నా ఆదానీకి లబ్ధి చేకూర్చేందుకు 10 శాతం బొగ్గు ఇతరుల నుంచి కొనేలా మోడీ చట్టం తీసుకవచ్చారని ఆరోపించారు. ప్రశ్నిస్తున్న వారిపై సీబీఐ, ఈడీ, ఐటీ కేంద్ర సంస్థలతో దాడులు చేయిస్తున్నారని అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్, మాజీ కార్పొరేటర్లు తిరుమల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. మాజీ కార్పొరేటర్లు, భవానీ ప్రవీణ్‌కుమార్, జి.వి.సాగర్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాసరావు, విఠల్‌రెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, బిచినేపల్లి వెంకటేశ్వర్ రావు, గుడాల మల్లేష్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌లకు క్యాష్ రివార్డులు

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌లు యాదగిరి, రఘునాయక్‌కు షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ క్యాష్ రివార్డులు అందించి అభినందించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామం వద్ద ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన కేసుకు సంబంధించి చాకచక్యంగా వ్యవహరించి గుర్తు తెలియని వాహనాన్ని కానిస్టేబుల్‌లు యాదగిరి, రఘునాయక్ గుర్తించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో షాద్‌నగర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వారిని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.



క్యాష్ రివార్డులు అందిస్తున్న ఏసీపీ కుషాల్కర్